క్లుప్తంగా

బాలల సత్వర చికిత్స కేంద్రం సందర్శన



సేవలపై ఆరాతీస్తున్న జడ్జి సుధ

ఆదోని రూరల్: ఆదోని మండల బాలల సత్వర చికిత్స కేంద్రాన్ని గురువారం ఆదోని మండల న్యాయసేవ అధికార సంస్థ చైర్మన్, జడ్జి పి.జె.సుధ, అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ సత్యవతి సందర్శించారు. అక్కడ ఉన్న వైద్యులు నవీన్, పీడియాట్రిషన్ వైద్యులతో మాట్లాడారు. పిల్లలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఈ కేంద్రంలో పుట్టుకతో లోపం గల చిన్నారులకు చెవి, కంటి, విటమిన్, మానసిక లోపం గల పిల్లలకు శిక్షణ పొందిన వైద్యులచే ఉచిత వైద్యం అందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు.

పోలీస్ స్టేషన్‌లో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న సీఐ గంగాధర్

గోనెగండ్ల: మండల కేంద్రం గోనెగండ్ల పోలీస్ స్టేషన్‌లో గురువారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సీఐ గంగాధర్ మాట్లాడుతూ కర్నూలు జిల్లా ఎస్పీ, ఎమ్మిగనూరు డీఎస్పీ సూచనల మేరకు పోలీసు స్టేషన్‌లో ఉచిత వైద్య శిబిరంను ఏర్పాటు చేశామన్నారు. పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న పోలీసులు, వారి కుటుంబ సభ్యులకు కర్నూలు మెడికవర్ ఆస్పత్రి డాక్టర్ ఇమ్రాన్ వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, పోలీసులు శ్రీరాములు, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు సమర్పించి ప్రార్థనలు జరుపుకున్నారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాష చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు.

కుటుంబ నియంత్రణ పాటించాలి

కోసిగి: ప్రతి ఇంట్లో కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించి తల్లీబిడ్డల ఆరోగ్యాలను కాపాడుకోవాలని డాక్టర్ రఘు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీ కేంద్రంలో గర్భిణులకు, బాలింతలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ మనోజ్, రజిత ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారిణి పూర్ణిమ, శంకరమ్మ సచివాలయ కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.


విద్యార్థులకు పలకల పంపిణీ



విద్యార్థులకు పలకలను అందజేస్తున్న గరుడాద్రి దత్తాత్రేయస్వామి

ఆదోని అర్బన్: మండలంలోని శ్రీ శృంగేరి శారద శంకరమఠంలో ఈనెల 3వ తేదీన వసంత పంచమి సందర్భంగా అక్షర అభ్యాసం సందర్భంగా భక్తులు సమర్పించిన 50 పలకలను గురువారం అర్చకులు గరుడాద్రి దత్తాత్రేయ స్వామి ఆధ్వర్యంలో విద్యార్థులకు అందించారు. పట్టణంలోని తిరుమలనగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం నిర్మల సమక్షంలో విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తిరుమలనగర్‌వాసులు మనోహర్, శివుడు, దత్తాత్రేయశర్మ తదితరులు పాల్గొన్నారు.

మధ్వారాధన పూజలు



పల్లకీసేవ నిర్వహిస్తున్న పూజారులు

ఆదోని అర్బన్: పట్టణ శివారులోని మంగరాయ కాలనీలో వెలిసిన శ్రీ మంగరాయ ఆంజనేయస్వామి సన్నిధిలో గురువారం మధ్వారాధన పూజలు వైభవంగా జరిగాయి. ఆలయ మేనేజర్ కృప్రేష్ ఆచార్ ఆధ్వర్యంలో పూజారులు గురు రాజాచారి, మాధవరం గోపీ, అక్షయలు ఆంజనేయస్వామికి ప్రత్యేక పూలు, వెండి ఆభరణాలతో అలంకరించారు. అనంతరం పల్లకీసేవ, ఆలయ ఆవరణలో రథోత్సవం నిర్వహించారు.

టిడ్కో గృహాలను అప్పగించండి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని మైనారిటీ కాలనీ వద్ద నిర్మించిన టిడ్కో గృహాలను లబ్ధిదారులకు వెంటనే అప్పగించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, నాయకులు భాస్కర్ యాదవ్, కేపీ జబ్బార్ డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ ఆధ్వర్యంలో మైనారిటీ కాలనీలోని టిడ్కో గృహాలను పరిశీలించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు విజయేంద్ర, దాదావలి, మల్లికార్జున గౌడ్, వీరేష్, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

సిద్ధేశ్వరుడి జాతరకు వేళాయె

- హాల్విలో రెండువేల ఏళ్ల నాటి పురాతన ఆలయం
- నేటి నుంచి జాతర
- సాయంత్రం రథోత్సవం



సిద్ధేశ్వరస్వామి ఆలయం

కౌతాళం: సిద్ధేశ్వరస్వామి జాతరకు వేళయ్యింది. శుక్రవారం స్వామి జాతర మహోత్సవం మండల పరిధిలోని హాల్వి గ్రామంలో వైభవంగా జరగనుంది. జాతర మహోత్సవంలో భాగంగా రుద్రాభిషేకం, బిల్వార్చన వంటి ప్రత్యేక పూజల అనంతరం సాయంత్రం గ్రామంలో రథోత్సవం వేలాది మంది భక్తుల మధ్య కోలాహలంగా సాగనుంది.

ఆలయం చరిత్ర

కౌతాళం మండలంలోని హాల్వి గ్రామంలో వెలసిన సిద్ధేశ్వరస్వామి ఆలయం ప్రసిద్ధి చెందిన పురాతనమైనది. ఈ ఆలయం సుమారు 2వేల ఏళ్లనాటిదని గ్రామపెద్దలు, పూర్వీకులు చెబుతుంటారు. పూర్వం కృతాయుగంలో త్రిశంకు మహారాజు తన గురువు బృహస్పతి కుమార్తెను రహస్యంగా వివాహమాడాడు. ఈ విషయం తెలుసుకున్న గురువు బృహస్పతి రాజ్యాన్ని పాలించే అర్హత రాజుకు లేదని శపించారని, ఆ శాప విమోచనం జరగాలంటే మూడు గోపురాలున్న 360 ఆలయాలను నిర్మించాలని ఋషులు చెప్పడంతో త్రిశంకు రాజు దానిని ఆచారిస్తాడు. ఈ రకమైన ఆలయాల్లో భాగంగానే హాల్విలో నిర్మించినట్లు చరిత్ర చెబుతుంది. ఇలాంటి ఆలయాలు కర్ణాటకలోని మాన్వి తాలూకాలోని హిరే కౌతాళంలో త్రయంబకేశ్వరాలయం, హాల్వి, హోళగుందలో సిద్ధేశ్వరాలయం పేరుతో ఉన్నట్లు పురాణాలు చెబుతున్నాయి. ఇప్పటికీ పాకిస్తాన్‌లో కూడా మూడు గోపురాలున్న ఆలయం ఉన్నట్లు చరిత్ర చెబుతుంది.



పూజలందుకుంటున్న సిద్ధేశ్వరస్వామి

తవ్వకాల్లో బయటపడ్డ ఆలయం

హాల్వి గ్రామంలో సుమారు 5వందల ఏళ్ల కిందట ఈ ఆలయం మట్టితో కప్పబడి ఉండేది. దీనిపై రైతులు పంటలు పండించారు. ఈ ఆలయం కొండకు అనుకుని ఉండటంతో వర్షపు నీరు పారి మట్టి కోతకు గురైంది. రైతు నాగలితో దున్నేటప్పుడు ఆలయ గోపురాలు బయటపడ్డాయి. అనంతరం తవ్వకాలు చేపడితే సిద్ధేశ్వరస్వామి ఆలయం బయటపడింది. అప్పటి నుంచి ఆలయంలో నిత్య పూజలు కొనసాగుతున్నట్లు పురాణగాథలు చెబుతున్నాయి.

బస్ షెల్టర్‌నూ వదలని కూటమి నేతలు

- పెద్దతుంబళంలో బస్‌షెల్టర్ స్థలం కబ్జాకు యత్నం
- స్థలంలో బంకు ఏర్పాటు
- తొలగించిన సర్పంచ్, గ్రామస్తులు



బస్ షెల్టర్‌కు ముందు అడ్డంగా బీజేపీ నాయకులు ఏర్పాటు చేసిన దుకాణం

ఆదోని రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో ఎన్నడూ లేనివిధంగా భూకబ్జాలకు తెరదీశారు. ప్రభుత్వ, ప్రైవేటు స్థలాలను ఆక్రమించుకుంటున్నారు. ఇటీవల నకిలీ ధ్రువపత్రాలకు స్థలాలను రిజిస్ట్రేషన్ చేయించుకున్న విషయం తెలిసిందే. తాజాగా మండల పరిధిలోని పెద్దతుంబళం బస్‌షెల్టర్ స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నించగా.. సర్పంచ్, గ్రామస్తులు ఎదురుతిరిగి అక్కడ ఏర్పాటు చేసిన కిరాణ బంకును తొలగించారు.

దశాబ్దాల క్రితం బస్‌షెల్టర్ ఏర్పాటు..

ఆదోని నుంచి రాయచూరు, మంత్రాలయం, కోసిగి ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రోడ్డులో ఉన్న అతిపెద్ద గ్రామ పంచాయతీ పెద్దతుంబళం. ఈ గ్రామంలో ప్రధాన రోడ్డులో దశాబ్దాల క్రితం ప్రయాణికుల సౌకర్యార్థం ప్రభుత్వం బస్ షెల్టర్‌ను ఏర్పాటు చేసింది. గ్రామ నడిబొడ్డున ఉన్న ఈ రోడ్డుకు ఇరువైపులా దాదాపు కిలోమీటర్ మేరకు అంగళ్లు, హోటళ్లు, ఎరువుల షాపులు, ఇతర వ్యాపార దుకాణాలు వెలిశాయి. అయితే సెంటర్‌లో బస్‌షెల్టర్ ఉండడంతో దాని ముందు దుకాణం ఏర్పాటు చేసి చిన్నగా షెల్టర్‌ను ఆక్రమించుకోవాలని అధికార కూటమి నాయకులు కుట్ర పన్నారు. రాత్రికి రాత్రి బస్ షెల్టర్ ముందు డబ్బా (దుకాణం) ఏర్పాటు చేశారు గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు నరసారెడ్డి బంధువులు. ఉదయం ఈ దృశ్యాన్ని చూసిన గ్రామస్తులు వైఎస్సార్‌సీపీకి చెందిన గ్రామ సర్పంచ్ మాల ఉచ్చప్పకు తెలియజేశారు. ఆయన వెంటనే స్పందించి గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులను కూడగట్టుకుని వారి సహకారంతో అక్కడ వేసిన డబ్బా దుకాణాన్ని తొలగించారు. దశాబ్దాలుగా ఉన్న బస్ షెల్టర్‌ను కూడా ఆక్రమించుకుని కూటమి నాయకులు ఇలా కబ్జాకు పాల్పడడం ఎంతవరకు సమంజసమని ప్రజలు బహిరంగంగా ప్రశ్నిస్తున్నారు. నిత్యం నీతులు చెప్పే ఎమ్మెల్యే పార్థసారథి అనుచరులు, బీజేపీ నాయకులు కబ్జాలకు పాల్పడుతున్నారని విమర్శిస్తున్నారు.

శుద్ధ జలాన్ని అందించండి



జెడ్పీ సీఈఓ నాసరరెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

పెద్దకడబూరు : శుద్ధి చేసిన జలాన్నే ప్రజలకు అందించాలని జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ, బీసీ కాలనీలో ఉన్న సీపీడబ్ల్యూఎస్ స్కీమ్‌లను ఇన్‌చార్జ్ ఎంపీడీఓ జయరాముడుతో కలిసి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీపీడబ్ల్యూఎస్ స్కీమ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి కొరత రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో సమావేశం అయ్యారు. సర్వేలను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు.

మండల అభివృద్ధికి సాయం చేయండి

మండల అభివృద్ధికి తగిన సాయం చేయాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి జెడ్పీ సీఈఓను కోరారు. మండల కేంద్రానికి వచ్చిన జెడ్పీ సీఈఓ నాసరరెడ్డిని మర్యాదపూర్వకంగా కలసి శాలువా పూలమాలలతో సన్మానించారు. అనంతరం స్థానిక జెడ్పీ హైస్కూల్ దగ్గరకు ఆయనతో పాటు వెళ్లారు. అక్కడ కాంపౌండ్ వాల్ లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పాఠశాలకు కాంపౌండ్ వాల్ నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో ఏఓ నాగరాజుస్వామి, పంచాయతీ రాజ్ ఏఈ ఖాదర్‌బాషా, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు జూము మూకన్న తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

గోనెగండ్ల: ఉద్యోగులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని జెడ్పీ సీఈఓ నాసర రెడ్డి సూచించారు. గురువారం మండల కేంద్రం గోనెగండ్ల ఎంపీడీఓ కార్యాలయాన్ని జెడ్పీ సీఈఓ ఆకస్మిక తనిఖీ చేశారు. తనిఖీ భాగంగా రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మణి మంజరి, ఏఓ బాబు భాస్కర్, ఈఓఆర్డీ అనంతసేన పాల్గొన్నారు.

విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలి



ఎమ్మిగనూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లోకి వెళ్తున్న జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్

ఎమ్మిగనూరురూరల్/గోనెగండ్ల: పోలీసులు తమ విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచించారు. పట్టణ, రూరల్, గోనెగండ్ల పోలీస్ స్టేషన్లను గురువారం రాత్రి ఆకస్మిత తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్లలో గదులు, సెల్‌లను పరిశీలించారు. ఆయా పోలీస్ స్టేషన్‌ల పరిధిలోని సమస్యాత్మక గ్రామాలు, కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సాగునీటి వనరులు, పంటల వివరాలపై కూడా ఆరా తీశారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ స్టేషన్ ఫిర్యాదుదారు వస్తే సమస్యను పూర్తిగా వినాలని సూచించారు. జిల్లాలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్పీతో పాటు డీఎస్పీ ఉపేంద్రబాబు, సీఐలు శ్రీనివాసులు, మధుసుధన్‌రావు, గంగాధర్, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోండి

గోనెగండ్ల: ఫిషరిస్ వ్యాపారం చేసుకునేందుకు మినీ రిటైల్ అవుట్ లెట్ పథకం కింద ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మత్స్యశాఖ డీడీ శ్యామల తెలిపారు. గురువారం గాజులదిన్నె ప్రాజెక్టులో మత్స్యకారుల సంఘం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశానికి ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డీడీ మాట్లాడుతూ ఫిషరిస్ వ్యాపారం చేసుకునేందుకు త్రీ వీలర్, టు స్కూటీ కం ఐస్ బాక్స్, ఫోర్ వీలర్ వెహికల్, ఫిష్ రెస్టారెంట్ ఏర్పాటుకు, మర బోట్లు, వలలు కొనుక్కునేందుకు సబ్సిడీ కింద రుణాలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. డీఈ విజయ్ కుమార్, ఎంపీడీఓ మణి మంజరి, తహసీల్దార్ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతుకు 11 అంకెల ఐడీ

గోనెగండ్ల : రాష్ట్రంలో ప్రతి రైతుకు 11 అంకెల ప్రత్యేక ఐడీ ఇవ్వనున్నట్లు ఎమ్మిగనూరు వ్యవసాయ సంచాలకులు మహమ్మద్ ఖాద్రీ తెలిపారు. గురువారం మండల పరిధిలోని బి.అగ్రహారం రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ భారత ప్రభుత్వం వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ, ఏపీ వ్యవసాయ శాఖ సమన్వయంతో ఫార్మర్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. రైతు 11 అంకెల గుర్తింపు సంఖ్య ద్వారానే ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, పంట రుణాలు, పంటల బీమా ఇతర వ్యవసాయ సంబంధిత సేవలను పొందడానికి వీలుంటుందన్నారు.

పశుగణనను పకడ్బందీగా చేయాలి



మాట్లాడుతున్న కర్నూలు ఉప సంచాలకులు డాక్టర్ దుర్గా ప్రసన్న

గోనెగండ్ల : పశుగణనను గ్రామస్థాయిలో ప్రతి ఒక్కరూ పకడ్బందీగా చేయాలని పశుసంవర్ధక శాఖ కర్నూలు ఉప సంచాలకులు డాక్టర్ దుర్గా ప్రసన్న సూచించారు. గురువారం మండల కేంద్రం గోనెగండ్ల ప్రాంతీయ పశువైద్యశాలలో దేవనకొండ, గోనెగండ్ల మండల పశు సంవర్ధకశాఖ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రతి ఐదేళ్లకు ఒకసారి నిర్వహించే పశుగణనను సిబ్బంది క్షేత్రస్థాయికి వెళ్లి పకడ్బందీగా చేయాలన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి గేదెలు, ఆవులు, ఎద్దులు, గొర్రెలు, మేకలు, పందులు, గుర్రాలు, కోళ్లు, పక్షులు సహా 16 రకాల పెంపుడు జంతువుల సమాచారాన్ని సేకరించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ వెంకటేశ్వర్లు, ఆయా మండలాల పశువైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

జెలటిన్ స్టిక్ పేలి వ్యక్తికి గాయాలు

పెద్దకడబూరు : జెలటిన్ స్టిక్ పేలి వ్యక్తికి గాయాలైన ఘటన మండల పరిధిలోని మేకడోణ గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ నిరంజన్‌రెడ్డి వివరాల మేరకు మేకడోణ గ్రామానికి చెందిన నారాయణస్వామి పొలంలో పెద్దపెద్ద బండలు, గుండ్లు ఉన్నాయి. వాటిని చదును చేసుకోవడం కోసం గత నాలుగు రోజులుగా జెలటిన్ స్టిక్స్‌తో బండలను పగలగొట్టుతున్నారు. బుధవారం సాయంత్రం పనులు అయ్యాక మిగిలిన జెలటిన్, డిటోనేటర్‌ను అక్కడే కంపచెట్లలో ఒకచోట దాచి పెట్టి ఇంటికి చేరుకున్నారు. గురువారం ఉదయం అదే గ్రామానికి చెందిన ఇబ్రహీంతో పాటో మరో 8 మంది కూలీలు పొలం చుట్టూ ఉన్న కంపచెట్లు, ముళ్లచెట్లును తొలగించిన కంపచెట్లుకు నిప్పుపెట్టారు. అయితే కంపచెట్లలో దాచిపెట్టిన జెలటిన్ స్టిక్, డిటోనేటర్ పేలడంతో ఇబ్రహీంకు గాయాలయ్యాయి. వెంటనే బాధితుడిని ఆదోని ఆస్పత్రికి తరలించారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఆదోని అర్బన్: ఈనెల 4న పురుగుమందు సేవించి కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని పర్వతాపురం గ్రామానికి చెందిన సన్నీ, గంగమ్మ దంపతుల కుమారుడు గురురాజా(25) కోలుకోలేక బుధవారం రాత్రి మృతిచెందాడని వన్ టౌన్ పోలీసులు తెలిపారు. పదేళ్ల క్రితం గురురాజా చూపు కోల్పోవడంతో తనకు పెళ్లి కావడంలేదని మనస్థాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు చెప్పారు.

ప్రతి షాపులో సీసీ కెమెరాలు తప్పనిసరి

కోసిగి: ప్రతిషాపు యాజమాని తమ షాపుల్లో సీసీ కెమెరాలను తప్పక ఏర్పాటు చేయాలని ఎస్ఐ చంద్రమోహన్ అన్నారు. స్థానిక పోలీస్టేషన్‌లో గురువారం వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ మెయిన్‌రోడ్డుపై ఉన్న వ్యాపారులు షాపుల ముందు ఉన్న డ్రైనేజీ వరకు ఆక్రమించి వ్యాపారాలు చేయరాదని, రోడ్లపై వాహనాలు నిలుపరాదని చెప్పారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోండి

నందవరం : వలసలు నివారణకు ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పిస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని ఉపాధి, వ్యవసాయ కూలీలకు ఏపీడీ అల్లిపీరా సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఉపాధి కూలీలు, వ్యవసాయ కూలీలతో ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ కూలీలు, ఉపాధి కూలీలు తమ గ్రామాల్లోనే ఉపాధి పనులు కల్పిస్తామని, వలసలు వెళ్లొద్దని సూచించారు. ఏపీఓ శ్రీనివాసులు, ఈసీ నూర్జహాన్, టీఏలు పాల్గొన్నారు.

ప్రాక్టికల్స్ పేరుతో అక్రమ వసూళ్లు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల్లో ప్రాక్టికల్స్ పేరుతో విద్యార్థుల నుంచి యాజమాన్యాలు అక్రమంగా డబ్బు వసూలు చేస్తున్నాయని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు విష్ణు, ఖాదర్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ వీరభద్రగౌడ్‌కు వినతిపత్రం అందజేశారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



తేజో శ్యామూల్ పాల్

ఆదోని సెంట్రల్: పట్టణానికి చెందిన తేజో శ్యామూల్ పాల్ బ్యాడ్మింటన్ నేషనల్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యాడు. శ్యామూల్ పాల్ ప్రస్తుతం హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా ఉద్యోగం చేస్తున్నాడని తండ్రి జాన్సన్ బాబు తెలిపారు. ఈ నెల 7, 8 తేదీలలో బళ్లారిలో జరిగే నేషనల్ చాంపియన్ షిప్ పోటీలకు తెలంగాణ రాష్ట్రం నుంచి క్రీడల్లో పాల్గొననున్నట్లు వెల్లడించారు.

వ్యాధులపై అవగాహన ఉండాలి

ఆదోని సెంట్రల్: ప్రతి విద్యార్థి వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని పార మెడికల్ అధికారి సీతారాముడు అన్నారు. పట్టణంలోని నెహ్రూమెమోరియల్ ఉన్నత పాఠశాలలో కుష్టు, క్షయ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శరీరంలో ఎక్కడైనా స్పర్శలేని మచ్చలు, బుడిపెలు, కాళ్లు, చేతులు తిమ్మర్లు వంటి లక్షణాలు ఉంటే దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్ష చేయించుకోవాలన్నారు. ఎంపీహెచ్‌ఓ బాబురాజు, సిబ్బంది భాస్కర్, అరుణ పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఉచిత వైద్య పరీక్షలు

ఆదోని అర్బన్: ఆదోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆరేకల్ ప్రభుత్వ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో గురువారం కంటి, చెవి, ముక్కు, గొంతు, జనరల్ వ్యాధులకు సంబంధించి ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. దాదాపు 300 మంది విద్యార్థినులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ కృష్ణమూర్తి, సెంట్రల్ వర్కింగ్ కమిటీ మెంబర్ డాక్టర్ గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరు వరకు గడువు పొడిగించాలి

ఆదోని రూరల్: బీసీ కార్పొరేషన్ రుణాల దరఖాస్తు గడువును ఈ నెల చివరి వరకు పొడిగించాలని ఆదోని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బి.నీలకంఠప్ప, ఎండీ.బసవరాజుస్వామి, సాకే మల్లేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాల దరఖాస్తుకు తక్కువ సమయాన్ని కేటాయించడం పట్ల నిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

గ్రామాల్లో తాగునీటి ఎద్దడిని నివారిద్దాం



సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న ఎంపీపీ అమరేష్

కౌతాళం: రానున్న వేసవి కాలంలో మండలంలో తాగునీటి ఎద్దడి లేకుండా ఆయా శాఖల అధికారులు ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీపీ అమరేష్ సూచించారు. గురువారం కౌతాళం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి సమావేశంలో మార్పు అవసరం అన్నారు. గ్రామాల్లో వేసవి కాలం దృష్ట్యా చెడిపోయిన బోర్లను గుర్తించి వాటి మరమ్మత్తులు చేపట్టాలన్నారు. మరమ్మతులకు రూ.3లక్షలు కేటాయించి అవసరమైన పరకరాలు కొనుగోలు చేశామని, సంబంధిత అధికారులు గ్రామాల్లో పని చేయని చేతి బోర్లను గుర్తించి రిపేరు చేయించి తాగునీటి ఎద్దడిని నివారించాలని సూచించారు. గ్రామంలో ఉన్న ప్రతి సమస్యను ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సమావేశంలో చర్చిస్తే వాటికి పరిష్కారం దొరుకుతుందన్నారు. వైస్ ఎంపీపీలు బుజ్జీస్వామి, లిఖిత, కో ఆప్షన్ మెంబర్ మహబుబ్‌సాబ్, ఎంపీడీఓ సుబ్బారాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కళాశాల వార్షికోత్సవం



డ్యాన్సు చేస్తున్న విద్యార్థులు

కోసిగి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి అధ్యక్షతన కళాశాల వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కోసిగి ఎస్ఐ చంద్రమోహన్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశలో ఇంటర్మీడియెట్ చాలా కీలకమైనదన్నారు. కష్టపడి చదివి ఉత్తమ మార్కులు సాధిస్తే.. భవిష్యత్‌ను తీర్చిదిద్దుకునేందుకు ఉపయుక్తమవుతుందన్నారు. చెడ్డ మార్గంలో వెళ్లకుండా సన్మార్గంలో నడుచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అధ్యాపకులు ఈరన్న, ఉదయ్‌భార్గవ్, వెంకటేషప్ప, సాంబశివుడు, రణప్రతాప్, మద్దిలేటి, అనంతమ్మ, జ్యోతి, జయమ్మ, రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పౌరులుగా ఎదగాలి



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కౌతాళం: ప్రతి విద్యార్థి ఉత్తమ పౌరుడిగా ఎదగాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరామ్ అన్నారు. గురువారం కళాశాల 24వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు రాబోవు పరీక్షల్లో మంచి ఫలితాలను సాధించాలన్నారు. ప్రతి విద్యార్థి ఉత్తమ లక్షణాలను పెంపొందించుకొని ఉత్తమ భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సంతోష్‌కుమార్, డేవిడ్, రవికుమార్, శ్రీనివాసరెడ్డి, సంధ్యారాణి, రాఘవేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.